## క్లుప్తంగా

### ఆలయ హుండీ కానుకల లెక్కింపు



**రామవరప్పాడు :** విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మకు భక్తులు హుండీల ద్వారా కానుకల రూపంలో సమర్పించిన ఆదాయం రూ.6,98,373 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని హుండీలను గురువారం శ్రీ దాస ఆంజనేయస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.భవాని సమక్షంలో లెక్కించారు. ఈ సందర్భంగా లోకేశ్వరి మాట్లాడుతూ ఆలయంలోని హుండీలను లెక్కించగా 3 నెలల 5 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ధర్మకర్తల మండలి సభ్యులు, సాయి సేవా దళ్ సభ్యులు పాల్గొన్నారు.

### ముగిసిన ఆటల పోటీలు



**గన్నవరం:** స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న 67వ క్రీడా సమాఖ్య నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు గురువారం ముగిశాయి. చివరి రోజున బాలికల అండర్ -14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, షటిల్, టెన్నికాయిట్, యోగా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాలకు చెందిన బాలికలు హాజరయ్యారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలికలను నియోజకవర్గ స్థాయి జట్లకు ఎంపిక చేశారు. వీరందరూ జిల్లా స్థాయి పోటీల్లో నియోజకవర్గం తరుపున ప్రాతినిధ్యం వహించనున్నారు. పాఠశాల హెచ్ఎం ఎస్.రవీంద్రభవాని, నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త ధనియాల నాగరాజు, నాలుగు మండలాల పీఈటీలు పాల్గొన్నారు.

### బోరు ఏర్పాటు పనులు ప్రారంభం



**ఉంగుటూరు:** ప్రజాల దాహార్తిని తీర్చేందుకు మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎంపీపీ వడ్లమూడి సరోజిని తెలిపారు. వెన్నూతలలో తాగునీటి అవసరాల కోసం మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6 లక్షలతో బోర్‌వెల్ ఏర్పాటు చేసేందుకు ఎంపీపీ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బోర్‌వెల్ పనులు త్వరగా పూర్తి చేసి తాగునీరు అందజేయాలన్నారు. బోర్ వెల్‌కు అనుసంధానంగా వాటర్ ప్లాంట్ నిర్మాణం చేసేందుకు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ సొంత నిధులు మంజూరు చేయగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ టి.వెంకట రామ్మోహన్‌రావు, వైస్‌ఎంపీపీ చంద్రశేఖర్, వెల్దిపాడు సర్పంచ్ లాం నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### వసతి గృహ విద్యార్థినులకు సాయం



**దావాజిగూడెం(గన్నవరం):** మండలంలోని దావాజిగూడెంలో ఉన్న ఎస్సీ, బీసీ ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు గురువారం రోటరీక్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ ద్వారా చాపలను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, రోటరీక్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్, వీకేఆర్ కళాశాల మాజీ కరస్పాండెంట్ చింతపల్లి సీతారామయ్య చేతుల మీదుగా 150 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా చింతపల్లి మాట్లాడుతూ.. సమాజాభివృద్ధిలో రోటరీక్లబ్ పాత్ర ఎనలేనిదన్నారు. పేద విద్యార్థుల సౌకర్యార్థం చాపలు పంపిణీకి ముందుకువచ్చిన రోటరీక్లబ్ కార్యవర్గాన్ని అభినందించారు. క్లబ్ కార్యదర్శి నర్రా సీతారామారావు, సభ్యులు గన్నె వెంకట్రావు, టీఎస్ఆర్‌కే. ప్రసాద్, బొప్పన సత్యనారాయణ, రవిబాబు, బ్రహ్మం పాల్గొన్నారు.

### లారీ ఢీకొని ఆటో డ్రైవర్‌కు గాయాలు

**కంకిపాడు:** లారీ ఢీకొని ఆటో డ్రైవరు గాయాల పాలైన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు...కంకిపాడు పట్టణంలోని గంధం టవర్స్‌లో నివాసం ఉంటున్న ప్రతిపాటి వీర్రాజు ఈనెల 19వ తేదీ రాత్రి సమయంలో తన ఆటో లారీకి అడ్డుగా ఉందని పక్కకు తీస్తుండగా సదరు లారీ డ్రైవరు వీర్రాజును ఢీకొట్టడంతో ఎడమ తొంటికి గాయమైంది. వీర్రాజు బంధువు ప్రభాకరరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

# సొసైటీ భవన నిర్మాణానికి చర్యలు

**అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాల తొలగింపు**

**పెనమలూరు:** పెనమలూరు సొసైటీ భవన నిర్మాణానికి ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. గతంలో భవన నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణాలను తొలగించటానికి ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సొసైటీగా పెనమలూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ) ఉంది. ఈ సొసైటీలో 750 మంది సభ్యులు ఉన్నారు. రెండేళ్ల క్రితం సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న బదరీనారాయణ పాలక వర్గ తీర్మానం , సీఆర్డీఏ ప్లాన్‌తో కొత్తగా భవన నిర్మాణం చేపట్టారు. ఈ మేరకు బేస్‌మెంట్ లెవల్ వరకు నిర్మాణం చేసి దాదాపు రూ.9 లక్షల వరకు నిధులు డ్రా చేశారు. అయితే సొసైటీ అధ్యక్షుడు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేశారని, నిర్మాణాలకు సంబంధించి ఎం.బుక్‌లో నమోదు కాకుండానే నిధులు డ్రా చేశారని పలువురు సొసైటీ సభ్యులు అభ్యంతరాలు లేవనెత్తారు. భవన నిర్మాణ పనులు కూడా నాణ్యతా లోపంతో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ లోగా సొసైటీ అధ్యక్షుడిగా బదరీనారాయణ పదవీ కాలం ముగిసింది. దీంతో సొసైటీ భవన నిర్మాణం వివాదంలో పడింది.

**నాణ్యతా లోపం ఉందని తేల్చిన నిపుణులు**

సొసైటీ భవన నిర్మాణం నాణ్యతా లోపంతో ఉందని సభ్యులు కొందరు డెప్యూటీ రిజిస్ట్రార్(డీఆర్)కు ఫిర్యాదు చేశారు. డీఆర్ సూచనలతో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ విభాగం సొసైటీ భవన నాణ్యతను తనిఖీ చేసి, నాణ్యతా లోపం ఉందని నివేదిక ఇచ్చారు. ఈ నివేదిక ఆధారంగా డీఆర్ గత సొసైటీ అధ్యక్షుడిపై క్రిమినల్ చర్యలకు ఆదేశించగా ఇది కోర్టు పరిధిలో ఉంది. సొసైటీ మహాజన సభ నూతన భవన నిర్మాణం చేయటానికి అడ్డుగా ఉన్న గత నిర్మాణాలు తొలగించాలని తీర్మానించటంతో పాలకవర్గం డీఆర్‌ను నూతన భవన నిర్మాణానికి అనుమతి కోరారు. ఇందులో భాగంగా బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేసి వదిలేసిన సొసైటీ భవనం తొలగించాలని డీఆర్ ఆదేశించారు. రూ.53 వేల టెండర్‌లో బేస్‌మెంట్ తొలగింపునకు టెండర్ ఖరారు చేసి తొలగింపు పనులు మొదలుపెట్టారు.

త్వరలో నూతన భవనం నిర్మాణం

పెనమలూరు సొసైటీ భవనం త్వరలో నిర్మాణం చేయనున్నారు.ఈ మేరకు మరల సీఆర్‌డీఏతో ప్లాన్ ఆమోదించిన తరువాత అంచనాలతో సాంకేతిక అనుమతులు తీసుకుని భవన నిర్మాణం చేస్తారు. పూర్తి నాణ్యతతో రైతులకు అనుకూలంగా ఉండే నూతన భవన నిర్మాణం చేపడతారు. ఈ మేరకు కార్యాచరణ రూపొందించామని, ఏడాది లోపు సొసైటీ భవనం రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని సొసైటీ ప్రస్తుత అధ్యక్షుడు వేమూరి నాగరవి(రాజా) తెలిపారు.



అసంపూర్తి నిర్మాణాలతో ఉన్న పెనమలూరు సొసైటీ భవనం

# ఫ్లై ఓవర్ డిజైన్ పరిశీలన

**రామవరప్పాడు :** విజయవాడరూరల్ మండలం నిడమానూరులో సుమారు రూ.70 కోట్లతో నిర్మించనున్న ఫ్లై ఓవర్ డిజైన్‌ను గురువారం పలు శాఖల అధికారులు పరిశీలించారు. గ్రామంలోని రైల్వేలైన్ వద్ద రైల్వే, రెవెన్యూ, పంచాయతీ, విద్యుత్ అధికారులు పర్యటించి ఫ్లై ఓవర్ డిజైన్‌ను పరిశీలించి కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శీలం రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రైల్వే శాఖ నిధులు రూ. 70 కోట్ల వ్యయంతో రైవస్ కాలువ రైల్వేలైన్ నుంచి మసీదు సెంటర్ మీదుగా వోల్వో షోరూం వరకు సుమారు 700 మీటర్ల పొడవున ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం జరగనుందని తెలిపారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎంపీ బాలశౌరి ద్వారా కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నిధుల మంజూరుకు కృషి చేశారన్నారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ నాథ్, రెవెన్యూ, రైల్వే అధికారులు పాల్గొన్నారు.



ఫ్లై ఓవర్ డిజైన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

# రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**కంకిపాడు:** రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కొణతనపాడు గ్రామంలో పూర్తి స్థాయిలో రీ సర్వే పూర్తయిందన్నారు. 318 ఖాతా నంబర్లకు సంబంధించి జగనన్న భూ హక్కు పత్రాలు కూడా మంజూరయ్యాయన్నారు. వివాదాలకు తావులేకుండా పూర్తి స్థాయిలో సర్వే చేసి హద్దులు నిర్ణయించామని, త్వరలోనే సంబంధిత యజమానులకు జగనన్న భూ హక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు సన్నాహాలు పూర్తి చేస్తున్నామన్నారు. కంకిపాడు, నెప్పల్లి, దావులూరు, ఈడుపుగల్లు, వేల్పూరు, ఉప్పలూరు, ప్రొద్దుటూరు, పునాదిపాడు, తెన్నేరు గ్రామాల్లో రీ సర్వే నిర్వహణకు చర్యలు తీసుకున్నామన్నారు.

**సమర్థంగా ఓటర్ల జాబితా**

ఓటర్ల జాబితా సమర్థంగా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ఫారమ్ 6కు 1494 అర్జీలు, ఫారమ్-7లో 2461 అర్జీలు, ఫారమ్ 8ఎంలో 459 అర్జీలు, ఫారమ్ 8సీలో 1284 అర్జీలు అందాయన్నారు. డోర్ నంబరు లేని ఓటరు ఐడీని గుర్తించామన్నారు. ఒకే డోర్ నంబరులో 10కి పైగా ఓటర్లు ఉన్న డోర్ నంబర్లు 146 గుర్తించామన్నారు. వీటిలో 1879 మంది ఓటర్లు ఉన్నట్లు పరిశీలనలో తేలిందన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి, తుది ఓటర్ల జాబితాను సమర్థంగా రూపొందిస్తామని వివరించారు. సమావేశంలో ఆర్ఐ వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



జగనన్న భూహక్కు పత్రం చూపుతున్న తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్

# ఘనంగా గురజాడ జయంతి

**హనుమాన్‌జంక్షన్ రూరల్:** సొంత లాభం కొంత మానుకుని పొరుగువారికి తోడు పడాలన్న ఆశయంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కార్యక్రమాలు ఆదర్శనీయమని అప్పనవీడు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు తోట పుష్పావతి అన్నారు. స్థానిక ఏలూరురోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో మానవత ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత మానవత జిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావుతో పాటుగా పలువురు మానవత సభ్యులు గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హనుమాన్‌జంక్షన్ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, క్లేపల్లి నారాయణరావు, కోశాధికారి గణేష్ బాబు, సీనియర్ సభ్యులు జన్యావుల సత్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, పొట్లూరి శేషాచలం, దయాల ప్రభాకరరావు, నారగాని కొండలరావు పాల్గొన్నారు.



గురజాడ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మానవత సభ్యులు

# మహిళా బిల్లు ఆమోదంపై హర్షం

**గన్నవరం:** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం తెలపడం పట్ల గురువారం స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, పార్టీ మహిళా నాయకురాలు సూరెడ్డి మణిమ్మ నేతృత్వంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం అవకాశం కల్పించి చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు. పార్టీ మహిళా నాయకులు కుర్రాటి అరుణకుమారి, ఈదా సుజాత, కునపరెడ్డి రజనీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



స్వీట్లు పంచుకుంటున్న మహిళా నేతలు

# నవరస నటుడు అక్కినేని నాగేశ్వరరావు

**విజయవాడ కల్చరల్:** నవరస నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు బండారు నరసింహారావు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, అక్కినేని పేరుతో పురస్కారాల ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు మాట్లాడుతూ అక్కినేని స్వయం కృషితో నటుడిగా జీవితం ప్రారంభించి విభిన్న పాత్రలు పోషించి నిర్మాతగా, స్టూడియో అధినేతగా ఎదిగారన్నారు. సినీ నటుడు కొప్పుల ఆనంద్ మాట్లాడుతూ అక్కినేని నటజీవితం తెరచిన పుస్తకంగా అభివర్ణించారు. అనంతరం మధురిమ బృందం కూచిపూడి నృత్యాలను ప్రదర్శించింది. పవన్‌కుమార్, స్వాతి, రెహానా తదితరులు అక్కినేని నటించిన చిత్రాల్లోని గీతాలను ఆలపించారు. వివిధ రంగాలకు చెందిన 120 మందికి నిర్వాహకులు పురస్కారాలు ప్రదానం చేశారు. నృత్యాలను ప్రదర్శించిన చిన్నారులకు జ్ఞాపికలను, ప్రశంసాపత్రాలు అందజేశారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**పెనమలూరు:** పోరంకి-నిడమానూరు రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలవటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి గంటయ్యవీధికి చెందిన ఎల్.పైడిరాజు నిడమానూరు రోడ్డులో బైక్‌పై వస్తుండగా వేణుగోపాలస్వామి వారి ఆలయం వద్ద వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అతని కాలుకు తీవ్ర గాయమైంది. బాధిత వ్యక్తిని 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

### సొంత స్థలంలో ఇళ్ల నిర్మాణానికి నిధులు

**ఉంగుటూరు:** మండలంలోని 27 గ్రామాల్లో సొంత ఇంటి స్థలం కలిగి ప్రభుత్వ సబ్సిడీతో ఇంటి నిర్మాణం చేయదలచిన వారు గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలని ఎంపీడీవో జీవీఎస్ శేషగిరిరావు సూచించారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ఆసక్తి కలిగిన లబ్ధిదారులు భార్య, భర్తల ఆధార్ కార్డులు, రైస్ కార్డు, స్థలం డాక్యుమెంటు, బ్యాంకు ఖాతా, ఫోన్ నంబరుతో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంటును సంప్రదించాలని కోరారు. గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు గృహనిర్మాణాలకు అర్హత కలిగిన వారిని గుర్తిస్తే తెలియజేయాలని పేర్కొన్నారు.

### విధుల్లో చేరిన 21 మంది పోలీసులు

**పెనమలూరు:** పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో 21 మంది పోలీసు సిబ్బంది విధుల్లో చేరారు. పెనమలూరు స్టేషన్‌కు ఇటీవల 22 మంది పోలీసు సిబ్బంది బదిలీ అయ్యారు. వీరిలో ఒక ఏఎస్ఐ, ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 15 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. కొత్తగా ఇప్పుడు ఇద్దరు ఏఎస్ఐలు, ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 14 మంది కానిస్టేబుళ్లు వచ్చి బుధ, గురువారాల్లో విధుల్లో చేరారు.

**క్రైమ్ ఎస్ఐగా రమేష్**

పెనమలూరు క్రైమ్ ఎస్ఐగా రమేష్ విధుల్లో చేరారు. గతంలో క్రైమ్ ఏఎస్ఐగా ఉన్న జయచంద్ర బదిలీ అవటంతో ఆయన స్థానంలో ఎస్ఐ రమేష్ వచ్చారు. వీఆర్‌లో ఉన్న రమేష్‌కు తాజాగా ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు.

### నేడు కానూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పెనమలూరు:** నేడు కానూరులో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఈఈ గురువారం ఒక ప్రకటనలో వివరాలు తెలుపుతూ కానూరు పరిధిలో గౌరీశంకర్ నగర్, మురళీ నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా మురళీ నగర్, బల్లెంవారి వీధి, గౌరీశంకర్ నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

# ఆర్టీసీ సెక్యూరిటీ ఉద్యోగి నిజాయితీ



**గన్నవరం:** బస్సులో ప్రయాణికురాలు మార్చిపోయిన పర్స్‌ను తిరిగి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు ఓ ఆర్టీసీ సెక్యూరిటీ కానిస్టేబుల్. వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన 252 బస్సు నైట్ ఔట్ సర్వీస్ ముగించుకుని బుధవారం రాత్రి 11 గంటలకు డ్రైవర్ డిపోకు తీసుకువచ్చాడు. సెక్యూరిటీ గేట్ వద్ద బస్సును తనిఖీ చేసిన డ్యూటీ కానిస్టేబుల్ ఎస్‌కె. రెహమాన్ సీట్ల మధ్య పడివున్న పర్స్‌ను గుర్తించి డిపో అధికారులకు అప్పగించాడు. ప్రయాణికురాలు స్వప్న కుమారి ఉదయం సెక్యూరిటీ రూమ్‌ను సంప్రదించగా టిక్కెట్ ఆధారంగా డ్యూటీ డ్రైవర్, కంట్రోలర్ సమక్షంలో పర్స్‌ను రెహమాన్ అందజేశారు. పర్స్‌ను చెక్ చేసుకున్న ఆమె అందులోని రూ.7వేల నగదు, వస్తువులు సక్రమంగా ఉండడంతో సంతోషం వ్యక్తం చేశారు. సదరు కానిస్టేబుల్‌ను డీఎం పి.శివాజీతో పాటు ఇతర అధికారులు అభినందించారు.

# విఘ్నాలు తొలగించయ్యా... విఘ్నేశ్వరా

**ఉయ్యూరులో ఎమ్మెల్యే పార్థసారథి ప్రత్యేక పూజలు**

**ఉయ్యూరు:** గణేష్ మహోత్సవాలు వాడవాడలా వైభవంగా జరుగుతున్నాయి. ఉయ్యూరు పట్టణంలోని చింతలతోటలో ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరుడిని గురువారం ఎమ్మెల్యే పార్థసారథి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఎమ్మెల్యేను ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించి వినాయక స్వామి ప్రతిమను బహూకరించారు. కంకిపాడు సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావు, పట్టణ ఎస్ఐ వీరప్రసాద్, కౌన్సిలర్లు రాజులపాటి చిన్ని, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, ఏఎంసీ డైరెక్టర్ ఆరేపల్లి నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజులపాటి రామచంద్రరావు, షేక్ అబు కలాం, జంపాన రవి, చింతల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**మంతెనలో ఘనంగా గణేష్ నిమజ్జనం**

**కంకిపాడు:** గణేష్ నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో గురువారం భక్తులు ఆయా గ్రామాల్లోని కూడళ్లలో కొలువుదీరిన స్వామివారికి పూజలు జరిపించి నైవేద్యాలు సమర్పించారు. మంతెన గ్రామంలోని కొత్తూరు సెంటరు వెంకటదాసు గుడి వద్ద ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరుడి ఊరేగింపు మహోత్సవం ఉత్సాహంగా సాగింది. డప్పు కళాకారుల విన్యాసాలు అబ్బురపరిచాయి. విఘ్నేశ్వరుడి ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఉత్సవాన్ని శ్రీ వెంకట దాసు గణేష్ ఉత్సవ కమిటీ పర్యవేక్షించింది.

**భక్తుల కోలాహలం మధ్య నిమజ్జనోత్సవం**

**గన్నవరం రూరల్:** మండలంలోని సూరంపల్లి గ్రామ శివారు రామచంద్రాపురంలో గణేష్ నిమజ్జనోత్సవం బుధవారం రాత్రి భక్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సెంటర్‌లో గ్రామస్తులు ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో వినాయకుని విగ్రహానికి పూజలు చేసి అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సమీపంలోని పోలవరం కాలువలో వినాయకుని విగ్రహాన్ని భక్తుల కోలాహలం మధ్య నిమజ్జనం చేశారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామస్తులకు ప్రసాదాలు అందజేశారు.



ఉయ్యూరు చింతలతోటలో ఎమ్మెల్యే పార్థసారథికి వినాయక ప్రతిమ అందిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు



రామచంద్రాపురంలో నిమజ్జనానికి తరలి వెళుతున్న వినాయకుడి విగ్రహం

# గణపతికి చిన్నారుల నృత్య నీరాజనం



పెనమలూరు పల్లిపేట చిన్నారులు భరతనాట్యం చేసి పూజ చేస్తున్న దృశ్యం

**పెనమలూరు:** మండల పరిధిలో వినాయకుడి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పెనమలూరు పల్లిపేటలో భారీ వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. ఇక్కడ గత 30 ఏళ్లుగా వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా చిన్నారులు వినాయకుడి మండపంలో భరతనాట్యం చేశారు. చిన్నారుల భరతనాట్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం చిన్నారులు వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. పోరంకి గంగానమ్మ గుడి విద్ద వినాయకుడి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గ్రామంలో శ్రీచెన్నకేశవస్వామివారి ఆలయ ప్రాంగణంలో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రతి రోజు రాత్రి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ప్రసాదం అందజేస్తున్నారు. మండల పరిధిలోని కానూరు, తాడిగడప, యనమలకుదురులో గురువారం పలు వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

### పెద్ద ముఠా కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తా

**ఎమ్మెల్యే పార్థసారథి**

**ఉయ్యూరు:** పెద్ద ముఠా కార్మికుల కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఉయ్యూరు పట్టణంలో గురువారం పర్యటనకు వచ్చిన ఆయన్ను పెద్ద ముఠా కార్మికులు కలిసి స్థలం సమస్యను విన్నవించారు. జాతీయ రహదారి సమీపంలో ఉన్న స్థలాన్ని కేటాయిస్తే తమ కార్యాలయం ఏర్పాటుచేసుకుంటామని కోరటంతో ఎమ్మెల్యే పార్థసారథి స్థల పరిశీలన చేశారు. అనంతరం ఇటీవల కాలువలో పడి మృతి చెందిన జంపాన పోతురాజు కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

### ప్రజారోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష

**కంకిపాడు:** ప్రజారోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష దోహదపడుతుందని ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామ పంచాయతీ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రామచంద్రరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క వలంటీరు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. నిపుణులైన వైద్యులతో నిర్వహించే వైద్య శిబిరం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్, ఎంపీటీసీ తోకల ఉమాదేవి, నగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ టెక్కెం సతీష్‌కుమార్, కొలుసు లక్ష్మణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### వివాహిత ఆత్మహత్యాయత్నం

**కంకిపాడు:** అసభ్యకర మాటలకు మనస్తాపానికి గురై ఓ వివాహిత ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డ సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు...మండలంలోని ఉప్పలూరు గ్రామంలో నివాసం ఉంటున్న కలపాల వజ్రలీల, జోజి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. ఈనెల 19న వజ్రలీల ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఆమె బంధువు కలపాల సుబ్బారావు వచ్చి అసభ్య పదజాలంతో దూషించి, కొట్టి, చంపుతానని బెదిరించాడు. ఈ విషయాన్ని వజ్రలీల ఆమె భర్తకు తెలిపింది. ఈనెల 20వ తేదీన ఆమె ఇంటి సమీపంలో నివాసం ఉంటున్న కవిత కూడా వజ్రలీలను ఇంటికి వచ్చి అసభ్యకరంగా దూషించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

### సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ శాంతి దినోత్సవం

**పెనమలూరు:** అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం నిర్వహించారు. కాలేజీలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ చేశారు. సమాజంలో శాంతిని నెలకొల్పడానికి, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర కోరారు. అణ్వాయుధాలు, క్షిపణులు, రక్తపాతం లేని సమాజం ప్రజలకు కావాలన్నారు. విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ చేశారు.